ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

# యారాడకొండ నవల-ఉత్తరాంధ్ర ప్రాంతీయ అస్తిత్వ పరిశీలన

**నరేష్ గురుగుబెల్లి**

పరిశోధకులు, తెలుగు శాఖ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఫోన్ 9440485346;ఇమెయిల్ nareshg.skl@gmail.com

**డాక్టర్.ఢిల్లీశ్వరరావు సనపల,**

**(పరిశోధన పర్యవేక్షకులు),తెలుగు అధ్యాపకులు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళం.**

**ఫోన్ 9441944208;Email: eswar.dilli820@gmail.com**

Received: 25/06/2026
Article Accepted: 28/07/2026
Published Online: 29/07/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.3.47

వ్యాససంగ్రహం

ఉణుదుర్తి సుధాకర్ రచించిన *యారాడకొండ* నవల విశాఖపట్టణపు భౌగోళిక పరిస్థితులను చారిత్రక అంశాలను వర్తక-వాణిజ్యాలను సంస్కృతీ సాంప్రదాయాలను వెల్లడించే ముఖ్యమైన నవల. రచయిత ప్రాంతీయతను కేవలం భౌగోళిక పరిమితిలో కాకుండా విశాఖపట్నం తీరప్రాంత జీవనాన్ని ఆధారంగా చేసుకొని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థాయిలలో కూడా ఆవిష్కరించారు. ఈ వ్యాసంలో భౌగోళిక, చారిత్రక, వర్తక-వాణిజ్య, సంస్కృతీ-సంప్రదాయాల ఆధారంగా నవలను పరిశీలించడం జరిగింది. ఈ నవలలో ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే అంశాలను విమర్శనాత్మక దృష్టిలో, గుణాత్మక విశ్లేషణ పద్ధతిలో పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో రచయిత రచనాశైలి, కథన పద్ధతులు, వర్ణనాత్మక లక్షణాల కంటే ప్రాంతీయ అస్తిత్వాన్ని నిర్మించే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఈ నవలపై నా జ్ఞాన పరిధి లో ప్రాంతీయ అస్తిత్వ కోణంలో పరిశోధన జరగలేదు. ఆ లోటును ఈ వ్యాసం కొంతవరకు పూరించగలదు.

**ముఖ్యపదాలు:** ఉత్తరాంధ్ర, ప్రాంతీయ అస్తిత్వం, యారాడకొండ, ఉణుదుర్తి సుధాకర్, ప్రాంతీయ నవల, సంస్కృతి, నమ్మకాలు, ఆచారాలు, వర్తక వాణిజ్యాలు.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

1. ఉపోద్ఘాతం

ఒక వ్యక్తిని లేదా ఒక సమాజాన్ని లేదా ఒక ప్రాంతాన్ని లేదా భాషా పరమైన విశేషాలను మిగిలిన వ్యక్తులు లేదా సమాజాలు లేదా ప్రాంతాలు నుండి వేరుచేసే నిర్దిష్ట లక్షణాల సముదాయాన్ని అస్తిత్వం గా పేర్కొనవచ్చు. ఈ నిర్దిష్ట అస్తిత్వ లక్షణాలే ఆయా అంశాలకు ప్రత్యేకతను చేకూర్చుతాయి. ఆధునిక కాలంలో ప్రాంతీయ అస్తిత్వ ధోరణిలో సాహిత్య ప్రక్రియలు విరివిగా వెలువడుతున్న నేపథ్యంలో నవలా సాహిత్యం కూడా ఇందుకు మినహాయింపు కాదు. తెలుగు నవలా సాహిత్యంలో ప్రాంతీయ నవలలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రాంతీయత అనేది కేవలం భాషాపరమైన విషయాల్లోనే లోనే కాకుండా జీవన విధానం, ఆచార వ్యవహారాలు, భౌగోళిక అంశాలు, ఆర్థిక స్థితిగతులు మొదలైన విషయాలలో వ్యక్తమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంత జీవన వైవిధ్యాన్ని, సముద్రతీర ప్రజల ఆచార వ్యవహారాలను, జీవన శైలిని ప్రతిబింబించే నవలల్లో *యారాడకొండ* ఒక ముఖ్యమైన నవల.

ఉణుదుర్తి సుధాకర్ ఈ నవలలో విశాఖపట్నం పరిసర ప్రాంతాలను, యారాడకొండ భౌగోళిక స్వరూపాన్ని, మత్స్యకార ప్రజల జీవన పోరాటాన్ని, ఆధునికీకరణ ప్రభావాలను వాస్తవకోణంలో చిత్రించారు. ఈ నవల ఉత్తరాంధ్ర ప్రాంతీయ అస్తిత్వాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడే సాధనంగా నిలుస్తుంది.

**2. యారాడకొండ నవలలో ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రతిబింబించే అంశాలు**

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

2.1 భౌగోళిక అంశాల పరిశీలన

*యారాడకొండ* నవలలో భౌగోళిక నేపథ్యం అత్యంత ప్రధానమైన అంశంగా ప్రాంతీయ అస్తిత్వానికి ఆధారంగా నిలుస్తుంది. నవలలో యారాడకొండ ఒక నిర్జీవ భౌగోళిక నిర్మాణంగా కాకుండా స్వగతం చెప్పుకునే సజీవ పాత్రగా తీర్చిదిద్దారు. యారాడ ప్రాంతం ఒక వైపు సముద్రాన్ని, మరోవైపు విభిన్న రకాల భూస్వరూపాలను కలిగి ఉండటం వల్ల అక్కడి ప్రజల జీవన విధానంపై ప్రకృతి ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సముద్ర అలలు, తుఫానులు, వర్షాలు, ఉప్పుగాలి వంటి ప్రకృతి లక్షణాలు ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తాయి. యారాడకొండ, మత్స్యకార గ్రామాలు, విశాఖ సముద్రతీరం వంటి అంశాలు నవలలో కేవలం వర్ణనాత్మకంగా కాకుండా కథా గమనాన్ని ప్రభావితం చేసే విధంగా ఉపయోగించబడ్డాయి. ఈ విధానం ద్వారా రచయిత ఈ ప్రాంత చరిత్ర, సంస్కృతి, సామాజిక పరిణామాలను యారాడకొండ దృష్టి కోణంలో వెల్లడించారు. నవల తొలి శీర్షిక ఉపోద్ఘాతంలో యారాడకొండ ఆకారం ఆధారంగా దీనికి"**బ్రిటీష్ వారు డాల్ఫిన్స్ నోస్ అని నామకరణం చేసి దీనిపై లైట్ హౌస్ నిర్మించారు" (**యారాడకొండ- పుట xv). స్థానికులు యారాడకొండను "**శాంతికొండ**" అని పిలుస్తారని యారాడకొండ స్వగతంగా చెప్పుకుంది. దీనికి గల కారణాన్ని "**ఔరంగజేబు పునరుద్ధరించిన ఆలంగీర్ మసీదు, దాని దిగువన సూఫీ ఇషాక్ మదీనా దర్గా, బ్రిటిష్ వారు నిర్మించిన మేరీ మాత చర్చి, పోర్టు ముఖద్వారంలో కాలువ ప్రక్కన వెలసిన వెంకటేశ్వరుడి గుడి- ఈ మూడూ కూడా ఒకే కొండ మీద ఉండడం"**(యారాడకొండ-పుట xvi**)** అని వెల్లడించింది.

నవలలో సముద్రం ఒక నేపథ్యం కాదు; అది ఒక సజీవ పాత్రను పోషించింది. మత్స్యకారుల జీవనం సముద్రంపైన ఆధారపడి ఉండడం కాదు; సముద్రమే వారి జీవితం. వారికి ఆకలి తీర్చి ప్రాణాలను నిలిపేది సముద్రమే. "**నలుగురు సీమెన్ అరగంట సేపు తంటాలుపడి గంగరాజు మృతదేహాన్ని పడవ క్రింది నుండి వెలికి తీశారు"**(యారాడకొండ-పుట 33) అని జమీల నౌక వలన గంగరాజు అనే మత్స్యకారుడు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో ఒక్కోసారి ప్రాణాలను తీసేది సముద్రమే అని రచయిత అంతర్లీనంగా వెల్లడించారు. భౌగోళిక పరిస్థితులు ప్రజల వృత్తులపై చూపే ప్రభావమును కూడా నవల ఉత్తమంగా ఆవిష్కరించింది. జాలారిపేట, చెంగల్రావుపేట, సోల్జరుపేట, కలయికగా ఉన్న విశాఖపట్నం పడవలతో చేపల వేట, చిన్నపాటి వ్యాపారాలలతో ఉండేదని, విశాఖపట్నం నలు చెరగులా విస్తరించడంలో పోర్టు ప్రధాన భూమిక పోషించిందని వెల్లడించారు. పారిశ్రామికీకరణ, ప్రకృతి వైపరీత్యాలు, సముద్రమట్టాల పెరుగుదల కారణంగా ముందుగా చెప్పుకున్న "**జాలారిపేట, చెంగల్రావుపేట, సోల్జరుపేట** సముద్రంలో **పూర్తిగా**

**మునిగిపోయాయి**"(యారాడకొండ -పుట 201) అని చివరి శీర్షిక అయిన **ఉపసంహారం లో** యారాడకొండ స్వగతంలో చెప్పుకుంది. ఈ ప్రస్తావన భౌగోళిక మార్పులు ప్రాంతీయ అస్తిత్వాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో సూచిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు, పారిశ్రామికీకరణ, పట్టణీకరణల కారణంగా సంప్రదాయ జీవన విధానాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని రచయిత సూచించాడు. కొన్ని ప్రాంతాల పేర్లు ఆధునికీకరణకు లోనయి కొత్త పేర్లను పొందినట్లు " **ఎల్లమ్మ తోట జగదాంబ జంక్షన్ అయింది. తుమ్మెదల మెట్ట చావుల మదుంగా మారి తరువాత కాన్వెంట్ జంక్షన్ గా స్థిరపడింది**" (యారాడకొండ-పుట 157) నవలలో వెల్లడించారు.

ఈ నవలకు యారాడకొండ అనే పేరు పెట్టడంలోనే నవలలో భౌగోళికతకు గల ప్రాధాన్యత వ్యక్తం అవుతుంది. ఈ విధంగా యారాడకొండ నవల విశాఖపట్నం ప్రాంత భౌగోళిక స్వరూపాన్ని, దానితో ముడిపడిన మానవ జీవనాన్ని, వృత్తి సంస్కృతిని, కాలక్రమేణా సంభవించిన భౌగోళిక మార్పులను సమగ్రంగా చిత్రించింది.

2.2 చారిత్రక అంశాలు

యారాడకొండ నవలలో విశాఖపట్నం ప్రాంత చారిత్రక పరిణామాలు, వలస పాలన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ చారిత్రక అంశాలు ప్రాంతీయ అస్తిత్వ నిర్మాణంలో కీలకపాత్ర వహించినట్లు నవల ద్వారా రచయిత వెల్లడించారు. యారాడకొండ చారిత్రకంగా బ్రిటిష్ పాలనాకాలం నుండి ఆధునిక విశాఖపట్నంగా వేగంగా అభివృద్ధి చెందిన తీరుకు సాక్ష్యంగా నిలిచింది. ఆధునిక పోర్ట్ నిర్మాణం, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలు స్థానిక ప్రజల జీవన విధానాన్ని మార్చాయి. విశాఖపట్నం అభివృద్ధిలో స్థానిక రాజులు మరియు జమీందారులు కూడా పాలుపంచుకున్నట్లు నవలలో వెల్లడించారు. **కమాను మీద ' కింగ్ ఎడ్వర్డ్ ది సెవెంత్ కొరొనేషన్ మార్కెట్' అని వ్రాసి ఉంది. ఆ బ్రిటీషు మహారాజు పట్టాభిషేకం సందర్భంగా కురుపాం రాజు కట్టించిన బజారుకి కురుపాం మార్కెట్ అన్న పేరే స్థిరపడిపోయింది"(యారాడకొండ-పుట 54)** అని వెల్లడించిన సందర్భంలోను**, "విక్టోరియా మహారాణి విగ్రహాన్ని ప్రతిష్టింపజేసిన స్థానిక జమీందారు అంకితం వెంకట జగ్గారావు సుప్రసిద్ధ ఏ.వి.యన్ కాలేజిని కూడా స్థాపించాడు**"(యారాడకొండ-పుట 47) అని వెల్లడించిన సందర్భంలో వలసపాలన కాలంలో నాటి స్థానిక రాజులు జమీందారులు ఆంగ్లేయుల ప్రాపకం కోసం ప్రాకులాడేవారని అనిపిస్తున్నప్పటికీ నాటి ఆంగ్లేయుల యొక్క వేధింపుల నుండి తప్పించుకోవడానికి చేపట్టిన చర్యలు గా చేసి ఉండవచ్చు. నగర ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో కీలకపాత్ర వహించిన విశాఖపట్నం పోర్టు నిర్మాణ బాధ్యతను బి.ఎన్.ఆర్(బెంగాల్- నాగపూర్-రైల్వే) చేపట్టిందని, పోర్టు నిర్మాణం 1933 లో పూర్తయిందన్న చారిత్రక వాస్తవాలను నవలలో ప్రస్తావించారు.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

మూడు పేటల గ్రామంగా ఉన్న విశాఖపట్నం అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంలో పోర్టు పాత్ర ప్రధానమైనదని వెల్లడించారు. "**జపాను వాడు బాంబులు వేసినా పాకిస్తానీయులు ఘాజి జలాంతర్గామిని పంపినా, హుద్-హుద్ తుఫాను బీభత్సం సృష్టించినా అన్ని ఆపదలనూ అధిగమించి నిలదొక్కుకున్నదీ నగరం**"(యారాడకొండ-పుట xvi) అని పేర్కొనడం ద్వారా విశాఖపట్నం అనేక చారిత్రక, రాజకీయ, ప్రకృతి సంబంధమైన సవాళ్లను అధిగమించి తన అస్తిత్వాన్ని నిలుపుకున్నట్లు రచయిత స్పష్టంచేశారు. పోర్టు నిర్మాణ సమయంలో ప్రవాహంతో పాటు కొట్టుకొచ్చిన ఇసుక మేట వేసి ఛానల్ ను మూసివేయటాన్ని అరికట్టిన భారతీయ ఇంజనీరింగ్ మేధావి అయిన శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి సాంకేతిక పరిజ్ఞానం ను "**ఒక పాత ఓడని చానెల్ వద్ద ముంచి వెయ్యమనీ అది ప్రవాహాన్ని ఒక గోడలాగా అడ్డుకొని, దాని దిశను మళ్ళిస్తుందని అతడు (మోక్షగుండం విశ్వేశ్వరయ్య) సలహా ఇచ్చాడు**(యారాడకొండ-పుట 50) అనే ప్రస్తావనలో స్మరించారు. ఈ విధంగా ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య గారి మేధో పరిజ్ఞానం కూడా దోహద పడింది.

విశాఖపట్నపు భౌగోళిక స్థితిలో ఉన్న ఎత్తుపల్లాలన్నీ దాని అభివృద్ధిలోనూ ఉన్నాయన్న విషయాన్ని నవలా రూపంలో ఆకృతీకరించడంలో సుధాకర్ గారు కృతకృత్యులయ్యారు. విశాఖపట్నం ప్రాంత చారిత్రక వికాసాన్ని, వలస పాలన ప్రభావాలను, స్థానిక పాలకుల సేవలను, పోర్టు ఆధారిత అభివృద్ధిని సమగ్రంగా యారాడకొండ నవల ఆవిష్కరించిందని చెప్పవచ్చు.

2.3 ఆర్థిక పరమైన అంశాలు

యారాడకొండ నవలలో వర్తక వాణిజ్య కార్యకలాపాలకు సముచితస్థానం కల్పించబడింది. మూడు గ్రామాల(జాలారిపేట , చెంగల్రావుపేట, సోల్జరుపేట) కలయికగా ఉన్న ప్రాంతం మహానగరంగా ఎదిగే క్రమంలో వర్తక వాణిజ్యాలు కూడా దిగువ, సాధారణ స్థాయి వ్యాపారాల నుండి పెద్ద స్థాయి వ్యాపారాలకు ఎదిగే క్రమం మనం నవలలో గమనించవచ్చు. సాధారణ పడవలతో చేపల వేట సాగించి వాటిని మార్కెట్లో అమ్మకాలు సాగించే వ్యాపారం నుండి డీప్-సీ ట్రాలర్లు ఉపయోగించి ఆధునిక పద్ధతుల్లో వేటసాగించి ఎగుమతులు చేసే వ్యాపార స్థాయి వరకు నవలలో ప్రస్తావించారు. విశాఖపట్నం అభివృద్ధిలో ఓడరేవుదే కీలకపాత్ర. " **పోర్టు పనుల్లో స్థానికులకు కాంట్రాక్టులు దొరికాయి వ్యాపారులకు కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి నౌకా వాణిజ్యంలో అప్పటికే ఆరితేరిన కలకత్తా కంపెనీలు, దొరల సంస్థలు కొన్ని తమ బ్రాంచి ఆఫీసులను విశాఖలో తెరిచాయి**"(యారాడకొండ-పుట 50) అనే ప్రస్తావన ద్వారా పోర్టు అభివృద్ధి చెందే క్రమంలో వివిధ రకాల వ్యాపారాలతో పాటు పోర్టు అనుబంధ వ్యాపారాలు కూడా విస్తరించాయి అని

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

రచయిత వెల్లడించారు. చిన్న వ్యాపారులకు, శ్రామికులకు అప్పులు ఇచ్చే కాబూలీవాలాలు ఈ ప్రాంతానికి కూడా చేరుకున్నారు. నాటి కాబూలీవాలాల యొక్క నైజంను "**కాబూలీవాలాలు అత్యవసరంగా డబ్బు అవసరం పడిన పోర్టు కార్మికులను, దిగువ మధ్య తరగతి జనాల్ని, చిరు వ్యాపారులని, ఒక్కోసారి జాలరుల్ని కూడా ఆప్యాయంగా పిలిచి రొక్కం చేతిలో పెట్టి ఆపద్బాంధవుల్లా ఆదుకునేవారు. వడ్డీలు కట్టించుకునేటప్పుడు మాత్రం వెంటాడి బూతులు తిడుతూ ముక్కు పిండి వడ్డీలు కట్టించుకునేవారు**" (యారాడకొండ-పుట 47) అని ప్రస్తావించారు. నాడు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులో లేకపోవడం వలన జరిగిన దోపిడీగా ఈ విషయాన్ని భావించవచ్చు. ఇది నేటి వడ్డీవ్యాపారుల, స్మాల్ ఫైనాన్స్ ఏజెన్సీల నైజానికి అచ్చు గుద్దినట్లు సరిపోలుతుంది. పోర్టు పనిచేయడం మొదలైనపుడు మొట్టమొదట దొరలు ఆ తరువాత బెంగాలీలు, గుజరాతీలు, మార్వాడీలతో పాటు "**దేశవిభజన సమయంలో పంజాబీలు, సింధీలు, బోరాముస్లింలు వచ్చి ఇక్కడ వ్యాపారాలు చేసి బాగుపడ్డారు కానీ ఎవరూ నష్టపోలేదు. అటు పెట్టుబడి, చొరబాటుతనం లోపించడం వలన స్థానికులు చిరుద్యోగులుగానో, శ్రామికులుగానో మిగిలిపోయారు. స్థానిక వ్యాపారులు ఒక స్థాయి కన్నా ఎదగలేకపోయారు**" (యారాడకొండ-పుట 96) అని వ్యాఖ్యానించడంలో సాహసికులు మాత్రమే వ్యాపారంలో అయినా, జీవితంలో అయినా రాణిస్తారని, వారు మాత్రమే అవకాశాలను అందిపుచ్చుకుంటారని ఈ విషయంలో నాటి ఈ ప్రాంతపు వారు వెనకబడ్డారని వెల్లడించారు. పోర్టు అభివృద్ధి, బాహ్య వ్యాపార వర్గాల ప్రవేశం వల్ల విశాఖపట్నం ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పటికీ, స్థానిక మత్స్యకారులు మరియు కార్మిక వర్గాలు ఆ అభివృద్ధి ఫలాలను సమానంగా పొందలేకపోయాయి. ఈ పరిస్థితి ప్రాంతీయ అస్తిత్వ సంక్షోభానికి దారితీసిన సామాజిక-ఆర్థిక వాస్తవంగా నవలలో రచయిత వెల్లడించారు.

ఓడల ఎగుమతి దిగుమతుల మాటున స్మగ్లింగ్ వ్యాపారం జరిగే తీరును కూడా ఈ నవలలో చిత్రించారు. జపాన్ నుండి విశాఖపట్నంకు వచ్చే నౌకలు ఈ వ్యాపారంలో ప్రధాన పాత్ర వహించేవి. "**మార్గమధ్యంలో సింగపూర్ లోఒక పూట ఆగేవి. వాటి సిబ్బంది ఎడాపెడా కొనుగోలు చేసి ఓడలో ఉండే అనేకానేక కుహరాల్లో కొన్న వస్తువులను దాచిపెట్టేవారు. విశాఖ బయట ఓడల లంగర్లు దించగానే జోరుగా అమ్మకాలు సాగేవి"(యారాడకొండ-**పుట 97) అని స్మగ్లింగ్ వ్యాపార పంథాను ఆవిష్కరించారు. సాంప్రదాయ మత్స్యకార జీవనం సాగించలేని కొందరు మత్స్యకారులు ఇలాంటి వాటిలో పాలుపంచుకున్నట్లు నవలలో పేర్కొన్నారు. జీవనోపాధి సంక్షోభంలో పడినప్పుడు వ్యక్తులు లేదా వ్యవస్థలు నైతికంగా పతనం చెందుతారని అర్థం చేసుకోవచ్చు. "**మొదట్లో నెల తిరగ్గానే డబ్బు చేతిలో పెట్టిన**

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

**సింహాచలం, ఆరునెలలు కాగానే నువ్వు పెట్టిన దానికంటే ఎక్కువే ఇచ్చాను అనేశాడు**"(యారాడకొండ-పుట 87) అని వ్యాపారంలో వాటాలు, లాభాలు, వడ్డీలు అంటూ జనాల నెత్తిన చెయ్యి పెట్టే సింహాచలం లాంటి వ్యక్తుల పోకడలను, మోసాలను ప్రస్తావించారు. "**డబ్బు చేతికొచ్చాక కన్నబాబు కొత్తగా చేసుకున్న దురలవాటు జూదం. బ్రాకెట్టు, పేకాట- ఈ రెండింటిలోనూ బాగా మునిగిపోయాడు"**(యారాడకొండ-పుట 95) అని అధిక ఆదాయం ఆశతో బ్రాకెట్ ఆటలు, పేకాట వంటి జూదాలు ఆడి దివాళా తీసే కన్నబాబు వంటి వ్యక్తులను, వారి దురలవాట్లను రచయిత ప్రస్తావించారు.
"**జాలరులతో సహకార సంస్థను ఏర్పాటు చేసి బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని మరపడవల్ని జాలర్లే స్వయంగా కొనుక్కోవాలన్నాడు. అమ్మకాలు ఎగుమతులు కూడా ఆ సంస్థ ద్వారానే నిర్వహించాలన్నాడు**" (యారాడకొండ-పుట122) అని గిరిధర్ పాత్ర మాటల్ని ఉదయ భాస్కర్ చెప్పినట్లు వ్యక్తపరచడం ద్వారా మత్స్యకారులు ఆధునిక పద్ధతుల్లో వేటను సాగించి ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండడం కోసం వామపక్ష పార్టీలు ఉద్యమ చైతన్యాన్ని మాత్రమే కాకుండా ఆర్థిక చైతన్యం కూడా కలిగించేవని రచయిత వెల్లడించారు. మారుతున్న కాలాన్ని బట్టి ఆర్థిక పరమైనటువంటి విషయాల్లో వచ్చినటువంటి మార్పుకు ఇది ఒక సంకేతం. ఆర్థిక పరిస్థితుల ఆధారంగా వ్యక్తుల గౌరవం, సామాజిక స్థానం మారిన పరిస్థితులు ఆధునిక సమాజ స్వభావాన్ని రొయ్యలనాయుడి వ్యవహారంలో రచయిత వెల్లడించారు. ఆధునికీకరణతో వచ్చిన పరిశ్రమలు స్థానిక జీవనంపై చూపిన ప్రభావం కూడా నవలలో ప్రస్తావించబడింది. పోర్టు విస్తరణ వల్ల, పరిశ్రమల వలన సంప్రదాయ జీవన విధానాలు మారడం, ప్రకృతి నాశనం కావడం ప్రాంతీయ అస్తిత్వానికి ఏర్పడుతున్న ముప్పుగా రచయిత ఆవిష్కరించారు.

2.4 చైతన్య స్వభావం

చైతన్య స్వభావం అంటే వ్యక్తి లేదా సమాజంలో అవగాహన, జాగృతి, సామాజిక బాధ్యతతో సమస్యలను గుర్తించి స్పందించే లక్షణం. ఉత్తరాంధ్ర ప్రాంత సమాజంలో ఉద్యమ చైతన్యం ఒక ముఖ్యమైన సామాజిక లక్షణంగా కనిపిస్తుంది. ఈ ప్రాంత చారిత్రక, సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా ప్రజల్లో నిరసన, ప్రతిఘటన బలంగా రూపుదిద్దుకున్నాయి. అందువల్ల ఉత్తరాంధ్ర రచయితల రచనలలో పోరాట తత్వం, సామాజిక ఉద్యమాల ప్రస్తావన చోటు చేసుకుంటాయి. ముఖ్యంగా కమ్యూనిస్టు, నక్సలైట్ ఉద్యమాలు ఈ ప్రాంత సామాజిక జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. **"1969 అక్టోబర్లో విశాఖపట్టణం సెంట్రల్ జైలు నుండి ఆదిభట్ల కైలాసం, నాగభూషణ్ పట్నాయక్‌లతో సహా 11 మంది నక్సలైట్లు నాటకీయంగా పారిపోవడం, ఆ తరువాత సత్యం–కైలాసంల ఎన్కౌంటర్లు వంటి సంఘటనలు ప్రజల చర్చల్లో**

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

**ప్రధానాంశాలుగా నిలిచాయి" (యారాడకొండ-పుట 110).** ఈ ప్రస్తావన ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంలో విప్లవోద్యమాల ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో రచయిత వెల్లడించారు. **"విశాఖపోర్టులో కళ్ళముందే ఇనుప ఖనిజం జపాన్ కు ఎగుమతి అవుతోంది. అదే జపాన్ నుండి ఉక్కు ప్లేట్లను దిగుమతి చేసుకుంటున్నాం. ఇది సరికాదు"**(యారాడకొండ-పుట 116) అని పేర్కొనడం ద్వారా స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకొని స్థానికంగానే పరిశ్రమ ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలన్న ఆలోచనే విశాఖ ఉక్కు ఉద్యమానికి ప్రాణం పోసింది. ఈ ఉద్యమ ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర ముఖచిత్రంను, ఆర్థిక వ్యవస్థను మార్చిన చోదక శక్తులలో ఒకటిగా చెప్పవచ్చు. "**విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు**" అనే నినాదం ఉత్తరాంధ్ర ప్రజల పోరాటస్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది.

**"నగరాలలో విద్యార్థి సంఘాల్లోనూ, పారిశ్రామిక వాడల్లోనూ మాత్రమే కాకుండా తీరప్రాంతాలలో మత్స్యకారుల సమస్యల పైన కూడా పనిచేయమని పార్టీ(కమ్యూనిస్టు పార్టీ) ఆదేశించింది"(యారాడకొండ-పుట 117)** అని చెప్పే సందర్భంలో సమస్యలున్న ప్రతిచోట అణగారిన వర్గాల పక్షాన వామపక్ష పార్టీలు పోరాటాలకు నాయకత్వం వహించాయి అని రచయిత నవలా పాత్రల ద్వారా వెల్లడించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పోరాట చైతన్యం కేవలం రాజకీయ ఉద్యమాలకు మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక మరియు వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి కూడా విస్తరించిందని రచయిత నవలా పాత్రల ద్వారా ఆవిష్కరించారు.

వామపక్ష పార్టీలు చేపట్టిన సామూహిక పోరాటాలతో పాటు, వ్యక్తిగత స్థాయిలో న్యాయపరమైన పోరాటం కూడా సామాజిక మార్పుకు సాధనమవుతుందని నూకరాజు పాత్ర ద్వారా రచయిత తెలియజేశారు. **"రూల్-ఆఫ్-లా అన్ని వర్గాలకీ, సమూహాలకీ, సమానంగా వర్తింప చేయడమే అని నూకరాజు దృఢంగా నమ్మాడు. పేదలకీ, పీడితులకీ చట్టం ఏర్పరిచే న్యాయం అందేట్టు చేయడమే తన జీవితం ధ్యేయం అని కొంత అమాయకంగానూ చాలా మొండిగానూ అతడు అనుకున్నాడు"**(యారాడకొండ-పుట 147) అని పేర్కొనడం ద్వారా సామాజిక న్యాయం కోసం పోరాటం అనేది కేవలం రాజకీయ ఉద్యమాల ద్వారా మాత్రమే కాకుండా న్యాయవ్యవస్థను ఆయుధంగా చేసుకొని కూడా సాగించవచ్చనే భావనను రచయిత వెల్లడించారు.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

యారాడకొండ నవలలో ఉద్యమ చైతన్యం అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. విప్లవ రాజకీయాలు, విశాఖ ఉక్కు ఉద్యమం, మత్స్యకారుల హక్కుల సాధన కోసం జరిగిన ప్రయత్నాలు, సహకార సంఘాల ఏర్పాటు, న్యాయపరమైన పోరాటాలు వంటి అంశాల ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల స్వభావాన్ని రచయిత ఆవిష్కరించారు.

2.5 ప్రజా జీవన విధానం

ప్రజా జీవన విధానం అంటే ఒక ప్రాంతంలోని లేదా దేశంలోని సాధారణ ప్రజల జీవన పరిస్థితులు, వారి ఆర్థిక, సామాజిక, విద్యా, సాంస్కృతిక, ఆరోగ్య సంబంధ పరిస్థితుల సమగ్ర స్వరూపం. నవలలో నాటి స్థానిక ప్రజల జీవన విధానాన్ని, భాషా వ్యవహారాలను రచయిత సహజంగా చిత్రించారు. సముద్రం పట్ల, గ్రామదేవతల పట్ల విశ్వాసం మరియు కొన్ని నమ్మకాలను, ఆచారాలను సందర్భానుసారంగా రచయిత వెల్లడించారు.

అ)స్త్రీల జీవన స్థితిగతులు

యారాడకొండ నవల జాలరి కుటుంబాలలో స్త్రీలకు ఉండే ప్రత్యేక స్థానాన్ని, వారికిచ్చిన విలువను చాలా చోట్ల ప్రస్తావించారు."**జాలరులలో ఆడపిల్ల పుట్టిందంటే పండగే. లక్ష్మీదేవి అడుగుపెట్టిందని అంతా మురిసిపోయేవారు. ప్లస్ లూ, మైనస్ లూ తత్సంబంధిత సమీకరణలూ వాళ్ళ ప్రపంచం లోకి అప్పటికింకా పూర్తి స్థాయిలో ప్రవేశించలేదు**"(యారాడకొండ-పుట 71) అని ప్రస్తావించిన సందర్భంలో ఆడపిల్లలను భారంగా భావించే కొన్ని ఉన్నత వర్గాల కంటే ఆలోచనా దృక్పథంలో ముందున్నట్లు భావించవచ్చు. యారాడకొండ నవలలో స్త్రీ పాత్రలను చాలా శక్తివంతంగా ఆధునిక భావాలు, ఆత్మవిశ్వాసం తొణికిసలాడే బలమైన వ్యక్తులుగా రచయిత తీర్చిదిద్దారు. మత్స్యకార స్త్రీల యొక్క వ్యాపార నైపుణ్యం , వాక్చాతుర్యం పలు సందర్భాల్లో నవలలో వ్యక్తమవుతుంది. "**బొత్తిగా చదువు లేకపోయినా బేరసారాలూ, అమ్మకాలూ, లెక్కలూ వాళ్ళకి మంచినీళ్లప్రాయం. చేపలు బజారుకు చేర్చడం, బయటి ప్రపంచంతో రోజువారీ పోరాటాలు చేయడం, నాలుగు డబ్బులు ఇంటికి తెసుకురావడం, అవసరం పడ్డప్పుడల్లా అప్పు పుట్టించడం, చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోవడం – ఇవన్నీ (మత్స్యకార) ఆడవాళ్ళ పనులే**" (యారాడకొండ-పుట 35). ఈ వర్ణన ద్వారా మత్స్యకార స్త్రీల ఆర్థిక నిర్వహణా నైపుణ్యం, వ్యాపార దక్షత, కుటుంబ బాధ్యతలను సమన్వయం చేసే సామర్థ్యం వెల్లడవుతుంది. ఉత్తరాంధ్ర మత్స్యకార స్త్రీలకు విద్య పట్ల సమున్నతమైన దృక్పథం ఉన్నట్లు రచయిత చిత్రించారు. భర్త చనిపోయినప్పటికీ, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ "**కొడుకుని డాక్టరు**

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

**చెయ్యాలనే, కూతుర్ని యూనివర్సిటీలో చదివించాలనే ఆమె(గంగమ్మ)కున్న కోరికనుబయటపెట్టింది**"(యారాడకొండ-పుట 56) అని ప్రస్తావించడంలో విద్య సామాజిక, ఆర్థిక పురోగతికి సాధనమనే అవగాహన మత్స్యకార స్త్రీలలో ఉన్నట్లు తెలుస్తుంది. "**జాలరి ఆడవాళ్లందరికీ సహజంగా పట్టుబడే ఆత్మవిశ్వాసం, ధీమా, మాటకి రెండు మాటలు అంటించే నోటి ధాటి**"(యారాడకొండ-పుట 74) అని మత్స్యకార స్త్రీలకు సహజసిద్ధంగా ఉండే గడసరితనం, ధైర్యాన్ని ప్రస్తావించారు. చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్న రెండు భిన్న తెలుగు ప్రాంతాల మధ్య ఉన్న ఆలోచనా ధోరణిని ఎల్లమ్మ(ఉత్తరాంధ్ర జాలరి స్త్రీ), కమల(మధ్య కోస్తా ప్రాంతపు ఉన్నత కుటుంబం) మధ్య జరిగిన సంభాషణలో గమనించవచ్చు. "**ఒక పక్క కోపం, ద్వేషం; మరో పక్క నేరభావం, భయం- ఇలాగైతే కష్టమే. ఇంత చదువుకుని, ఇంత పెద్ద డాక్టరువి అయి ఉండీ మొగుడికి భయపడడం ఏమిటి**"(యారాడకొండ-పుట 179) అని ఎల్లమ్మ పాత్ర ద్వారా ఉత్తరాంధ్ర మహిళలు సంప్రదాయ విలువలను గౌరవిస్తూనే, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం మరియు స్వతంత్ర ఆలోచనా విధానాన్ని కలిగి ఉన్నారని రచయిత వెల్లడించారు. యారాడకొండ నవలలో మహిళలను కేవలం కుటుంబ పరిమితుల్లో బంధించకుండా, మారుతున్న సమాజానికి అనుగుణంగా స్వీయ అవగాహన, ఆర్థిక స్వతంత్రత, విద్యావిధానాల పట్ల అవగాహన కలిగిన వ్యక్తులుగా చిత్రించారు. సామాజిక, ఆర్థిక పరమైన వ్యవహారాలలో చైతన్య దీప్తులుగా చిత్రించారు.

**ఆ) ఆచార వ్యవహారాలు**

మత్స్యకారులకు కులదైవాల పట్ల బలమైన నమ్మకం కలిగి ఉన్నట్లు నవల్లో పేర్కొన్నారు. "**వేటలో ఉండే వాళ్లందరికీ ఆ అమ్మవారే కులదైవం. ఆమె చల్లని చూపే తమ వాళ్ళందర్నీ తుఫానుల నుండి కాపాడుతుందని వేటకు వెళ్లే మగవాళ్ళకి రక్షణగా నిలుస్తుందని జాలరుల దృఢవిశ్వాసం**"(యారాడకొండ-పుట 37) అని పేర్కొనడం ద్వారా మత్స్యకారులకు కులదైవాల పట్ల ఉన్న బలమైన నమ్మకాలు, విశ్వాసాలు వెల్లడవుతాయి. మత్స్యకారుల పరిశీలనాశక్తి ప్రకృతి పట్ల వారికున్న అవగాహనలను "**పైన చంద్రుడి చుట్టూ వలయాకారంలో గుడి, దక్షిణపు గాలి బలంగా వీస్తోంది. నీసు వాసన, సముద్రం ఈనింది. ఇప్పుడు గనక పడవని దక్షిణం వైపుగా బారు వేస్తే చేపలు బాగా పడతాయి అనుకున్నాడు**"(యారాడకొండ-పుట 84) అని నూకరాజు పాత్ర ద్వారా రచయిత వెల్లడించారు. మత్స్యకారులు వేటకు బయలుదేరే సమయంలో కొన్ని నమ్మకాలు, విశ్వాసాలను అనుసరిస్తారు. ఉదాహరణకు "**జాలర్లు వేటకు బయలుదేరేటప్పుడు ఆడవాళ్లు వెంట రాకూడదని, పడవని తాకకూడదని వారిలో ఒక ఆచారం ఉన్నది**"(యారాడకొండ-పుట 86) అని వెల్లడించడం ద్వారా

మత్స్యకారుల నమ్మకాలు స్త్రీ పురుషులకు వేర్వేరుగా ఉన్నట్లు వెల్లడించారు. రచయిత ఈ నమ్మకాల్ని మూఢవిశ్వాసాలుగా కాకుండా ప్రజల జీవితానుభవాల సారంగా చిత్రించారు. ఒక ప్రాంత ప్రజల సామూహిక జీవన విధానం, సంస్కృతి, సామాజిక నిర్మాణాన్ని అవగాహన చేసుకోవడంలో ఇటువంటి నమ్మకాలు, ఆచారాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల నవలలో ఈ అంశాలను ఉత్తరాంధ్ర ప్రాంతీయ అస్తిత్వాన్ని తెలియజేసే ముఖ్యమైన సాంస్కృతిక అంశాలుగా పరిగణించవచ్చు.

**ఇ) ఆహార విధానం**

నవలలో రచయిత మత్స్యకారుల, బ్రాహ్మణుల, ఆంగ్లేయుల యొక్క ఆహారపుటలవాట్లను వివిధ సందర్భాల్లో వెల్లడించారు. "**మత్స్యకారుల ఇళ్లల్లో చేపలతో చేసే వంటకాలు రోజూ ఉండేవే. మాంసం వండిన రోజునే విందు భోజనం**"(యారాడకొండ-పుట 74) అని తెలిపిన సందర్భంలో మత్స్యకారుల దైనందిన ఆహారంలో చేపలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించినప్పటికీ, మాంసాహార వంటకాలను ప్రత్యేక సందర్భాల ఆహారంగా భావించేవారని తెలుస్తుంది. "**శనివారం కదా! మాయమ్మ నీసు ముట్టదు"(యారాడకొండ-పుట 111)** అని చెప్పిన సందర్భంలో జాలరి స్త్రీలు వార నియమాలు పాటిస్తారని వెల్లడించారు. బ్రాహ్మణులు సాధారణంగా శాఖాహారులని, మాంసాహారం భుజించరని, అభ్యుదయవాదులుగా చెప్పుకునే బ్రాహ్మణులు కొందరు తింటే వారిని సాధారణ ప్రజలు అనుమానంగా చూసే పరిస్థితిని ఉదయబాస్కర్ పాత్ర వ్యవహారంలో తెలియజేశారు. అలాగే బ్రాహ్మణ ఆహార సంస్కృతి ప్రస్తావనలో ఈ ప్రాంతపు ప్రత్యేక ఆహారమైన **తరవాణి అన్నము**ను ప్రస్తావించారు(యారాడకొండ-పుట 104). ఆంగ్లేయుల జీవన విధానాన్ని వెల్లడించే సందర్భంగా మాంసాహారాలు, కేకులు, బ్రెడ్ లు వారి ఆహారంలో భాగంగాను, మద్యపానం పురుషులకు సాధారణ అలవాటుగా జిమ్మీ షెరాన్ కుటుంబ నేపథ్యంలో తెలియజేశారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని నిర్మించే అంశాలలో ఆహారపుటలవాట్లు కూడా ఒక ముఖ్యమైన భాగంగా రచయిత చిత్రించారు.

**ఈ) మత సంప్రదాయాలు**

విశాఖ ప్రాంతం అన్ని మతాలనూ ఆదరించిన ప్రాంతంగా రచయిత నవలలో చిత్రించారు. నవల ప్రారంభంలోనే యారాడకొండ హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రార్థనాలయాలకు ఆలవాలంగా ఉందని పేర్కొన్నారు. వీటితోపాటు "**దేశ విభజన జరిగినప్పుడు పంజాబీలు, సింధీలు, బోరాముస్లింలు వచ్చారు"**(యారాడకొండ-పుట 96) అనీ, కాబూలీవాలాలను గూర్చి వర్ణించు సందర్భంలో "**పష్తో భాషలో బిగ్గరగా మాట్లాడుకుంటూ కనిపించే కాబూలీవాలాలు దేశం కాని దేశంలో ఉన్నామని**

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

**వారికెన్నడూ అనిపించినట్లు లేదు. ఆఫ్ఘనిస్తాన్ లో ఉన్నంత ధీమాగా స్వేచ్ఛగా ఇక్కడ కూడా సంచరించేవారు**"(యారాడకొండ-పుట 47) అని చెప్పడం ద్వారా విశాఖపట్నంలో అన్ని మతాలవారు కలిసిమెలిసి ఉండేవారని పరమత సహనంతో మెలిగేవారని రచయిత వెల్లడించారు. విశాఖపట్నం ప్రాంత మత్స్యకారులు సాధారణంగా హిందూ మతస్తులు. వీరు దేవాలయాలతో పాటు విద్యాలయాలను కూడా దేవాలయాలు గానే భావిస్తారని "**కరక చెట్టు పోలమాంబ గుడికి వెళ్లి వస్తూ ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణాన్ని దాటినప్పుడల్లా అమ్మా సరస్వతీ నా పిల్లలకి చదువు బాగా రావాల అని ఆ భవనాలకు దండం పెట్టుకుంటుంది. యూనివర్సిటీ అంటేనే సరస్వతి నిలయమని ఆమె భావన**"(యారాడకొండ-పుట్ట 18) అనే సందర్భం ద్వారా విద్య పట్ల ప్రజల్లో ఉన్న భక్తి బావం వెల్లడవుతుంది. అలాగే ఈ ప్రాంతపు పిల్లలు పుస్తకాలను సరస్వతీ దేవి స్వరూపంగా భావిస్తారని ఎల్లమ్మ, వెంకటేశు పాత్రల ద్వారా వెల్లడించారు. విశాఖపట్నం ప్రాంత ప్రజలకు మతసామరస్యం, పరమత సహనం, విద్య పట్ల ఉన్న గౌరవభావం ఈ ప్రాంత ముఖ్యమైన లక్షణాలుగా నవలలో రచయిత తెలియజేశారు.

**ఉ) పలుకుబడులు-పదబంధాలు**

నవల మొత్తం యారాడకొండ స్వగతంగా గ్రంథస్థ వ్యవహారిక భాషను ఉపయోగించినప్పటికీ అక్కడక్కడ ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల దైనందిన జీవితంలో వినిపించే అనేక స్థానిక పదాలు, పదబంధాలు, జాతీయాలు రచయిత సముచితంగా ఉపయోగించారు

1. **గొర్రె** తోక బెత్తెడు: ఎన్ని వనరులు ఉన్నప్పటికీ, ఎంత కష్టపడినప్పటికీ ఫలితం చాలా తక్కువగా ఉంది లేదా ఆశించిన మార్పు లేదు అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 119).
2. **పుర్రాకులు: "**నానా కష్టాలు" అనే అర్థంలో ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 19).
3. **కుక్కిన పేను:** భయంతో లేదా అవమాన బారంతో పల్లెత్తు మాట అనకుండా పడివుండే సందర్భంలో ఈ పదబంధాన్ని ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 71).
4. **ముసుగులో గుద్దులాట:** శత్రుత్వంను లేదా విరోధాన్ని బహిరంగంగా ప్రకటించకుండా ఒకరిపై ఒకరు పరోక్షంగా నిందలు వేసుకోవడం లేదా ఒకర్ని ఒకరు దెబ్బతీయాలనుకొనే సందర్భంలో దీన్ని ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 179).

5. **మునగ చెట్టు ఎక్కడం:** అవతలి వారి పొగడ్తలకు పొంగిపోయి వాస్తవాలను గ్రహించకుండా గొప్పలకు పోయి కష్టాలను తెచ్చుకోవడం అనే అర్థంలో ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 152).
6. **తమ్ముడు తమ్ముడే-పేకాట పేకాటే:** బంధుత్వాలు, ఆప్యాయతలు ఎంత ఉన్నప్పటికీ ఆర్థిక పరమైన అంశాలలో ఒకే దృష్టితో చూడడం అనే అర్థంలో ఉపయోగిస్తారు(యారాడకొండ-పుట 145).
7. **మనసు విరిగిపోవడం:** నమ్మినవారే మోసం చేసినపుడు లేదా వెన్నుపోటు పొడిచినప్పుడు వారి పట్ల ఏర్పడే తీవ్ర మానసిక విరోధం(యారాడకొండ-పుట 126)
8. **బోకరు మాటలు:** అబద్ధపు హామీలను లేదా నిజాయితీ లేని కబుర్లు చెప్పి అవతలి వారిని మోసగించాలని చెప్పే మాటలని అర్థం(యారాడకొండ-పుట 42).

యారాడకొండ నవలలోని ఈ స్థానిక పదబంధాలు ఉత్తరాంధ్ర ప్రాంతీయ భాషా విశిష్టతను, ప్రజల యొక్క వ్యవహారిక జ్ఞానానికి గుర్తింపునిచ్చే అంశాలుగా నిలుస్తాయి.

ముగింపు

ఉణుదుర్తి సుధాకర్ రచించిన *యారాడకొండ* నవల ఉత్తరాంధ్ర ప్రాంతీయ అస్తిత్వ వైవిధ్యాన్ని వెల్లడించే ప్రాంతీయ నవలగా నిలుస్తుంది. **విలియం కూపర్ "వైవిధ్యమే జీవితానికి అసలైన మసాలా వంటిది. అదే దానికి రుచిని ఇస్తుంది"** అని చెప్పిన విధంగా భౌగోళిక నేపథ్యం, చారిత్రక అవగాహన, ఆర్థిక పరమైన అంశాలు,, ప్రజల జీవన విధానం, మతం, భాష, ఆహారపుటలవాట్లు వంటి అంశాల సమన్వయంతో రచయిత ఉత్తరాంధ్ర జీవన వైవిధ్యాన్ని సజీవంగా చిత్రించారు .

ఈ నవల ద్వారా ప్రాంతీయత అనేది కేవలం ప్రాంత పరిమితి కాదని; అది ప్రజల చరిత్ర, సంస్కృతి, వర్తక-వాణిజ్యం, జీవన పోరాటం, వైవిధ్యాల సమాహారమని స్పష్టమవుతుంది. ఆధునికీకరణ ప్రభావాల మధ్య ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఆవశ్యకతను ఈ నవల బలంగా వెల్లడిస్తుంది.

అందువల్ల *యారాడకొండ* ఉత్తరాంధ్ర నవలా సాహిత్యంలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ అస్తిత్వాన్ని చాటిచెప్పే ముఖ్యమైన సాహిత్య కృతిగా చెప్పవచ్చు.

పాదముద్రలు

1. భౌగోళిక అంశాల పరిశీలన – xv, xvi, 33, 157, 201, పుటలు
2. చారిత్రక అంశాలు – xvi, 47, 50, 54 పుటలు

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

3. ఆర్థిక పరమైన అంశాలు – 47, 50, 87, 95, 96, 97, 122 పుటలు

4. చైతన్య స్వభావం – 110, 116, 117, 147పుటలు

5. ప్రజాజీవన విధానం – పుటలు

- అ)స్త్రీల జీవన స్థితిగతులు: 35, 56, 71, 74, 179
- ఆ) ఆచార వ్యవహారాలు: 37, 84, 86
- ఇ) ఆహార విధానం: 74, 111, 104
- **ఈ) మత సంప్రదాయాలు:** 18, 47, 96
- **ఉ ) పలుకుబడులు-పదబంధాలు:** 19,42, 71, 119, 126, 145, 152, 179

**ఉపయుక్త గ్రంథసూచి**


1. సుధాకర్ ఉనుదుర్తి, (2021). *యారాడకొండ,* ఆన్వీక్షికి పబ్లిషర్స్ ప్రై. లి., హైదరాబాద్.
2. డా. జయప్రకాష్,ఎస్,(1990). పరిశోధన విధానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. ప్రొ. అప్పారావు గంధం,(1993). పరిశోధన పద్ధతులు,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. డా. రామమోహనరాయ్ కడియాల,(2005). ఉత్తరాంధ్ర నవలా వికాసం-1, వెలుగు సాంస్కృతిక సంస్థ, విశాఖపట్నం.
5. డా. రాధాకృష్ణ బూదరాజు,(2012). తెలుగు మాండలికాలు శ్రీకాకుళం జిల్లా, తెలుగు అకాడమి, హైదరాబాద్.
6. వెంకటరావు బగాది,(2015). సిక్కోలు సామెతలు – సంగతులు, శ్రీకాకుళసాహితి, శ్రీకాకుళం.